ముక్క లేకపోతే ముద్ద దిగట్లే!

- తెలంగాణలో 96 శాతం మంది మాంసాహారులే
- నిరుడు కంటే రాష్ట్రంలో ఐదు శాతం పెరుగుదల
- తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన తునకల వినియోగం
- స్టాటిక్స్ ఆఫ్ ఇండియా తాజా నివేదికలో వెల్లడి

దేశవ్యాప్తంగా ప్రతి వంద మందిలో 70 మంది, బంగాళాఖాతం పరివాహక ప్రాంతాల్లో నివసించే 90 శాతం మంది మాంసాహారులే. లక్షద్వీప్‌లో 100 శాతం మాంసాహారులు. తర్వాత స్థానాల్లో ఈశాన్య రాష్ట్రాల్లో (99 శాతం), కేరళ 98 శాతం, పుదుచ్చేరి 97 శాతం, తమిళనాడు 96.4, ఏపీ, తెలంగాణలో 96 శాతం, అత్యల్పంగా రాజస్థాన్‌లో 32.4 శాతం మంది మాంసాహారులు ఉన్నారు.

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో కార్యం ఏదైనా ముక్క, మందు ఉండాల్సిందే. సందర్భం ఎలాంటిదైనా మెనూలో మటన్ లేదా చికెన్ పెట్టాల్సిందే. అధిక శాతం మందికి ముక్క లేనిదే ముద్ద దిగడం లేదు. ఎందుకంటే రాష్ట్ర జనాభాలో 96 శాతం మంది మాంసాహరులే. స్టాట్స్ ఆఫ్ ఇండియా రూపొందించిన తాజా నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా ప్రతి వంద మందిలో 70 మంది మాంసాహారులే ఉండగా... తెలుగు రాష్ట్రాల్లో నలుగురు మాత్రమే శాఖాహారులు ఉన్నారు. మిగిలిన 96 మంది మాంసం తినేందుకు ఇష్టపడుతున్నారని వెల్లడైంది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో మాంసం కొనుగోళ్లు, మాంసహారాలు, ఆహారపు అలవాట్లు, శాఖాహారం వినియోగం ఏ విధంగా ఉందనే విషయాన్ని తెలుసుకున్నారు. ఇందులో 18-49 ఏండ్లలోపు ఉన్న స్త్రీ, పురుషులతో కలిసి సర్వే చేయగా... తెలుగు రాష్ట్రాల్లో 96 శాతం మంది మాంసాహారులే ఉన్నారని స్పష్టమైంది. తెలంగాణలో గతేడాది కంటే మాంసాహారుల సంఖ్య ఐదు శాతం పెరిగినట్లుగా వెల్లడైంది. జాతీయ కుటుంబ, ఆరోగ్య సర్వేను ప్రామాణికంగా తీసుకొని ఈ అధ్యయనం చేసినట్లుగా స్టాట్స్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల్లో మాంసం తినేవారే ఎక్కువగా ఉండగా.. జాతీయ సగటు కంటే 20 శాతం అధికంగా ఉన్నట్టు తేలింది.

ముక్క ఉండాల్సిందే..

దేశంలో ఏటా మాంసం వినియోగం పెరుగుతున్నది. 2015-16లో 74 శాతం మంది మాంసాహారులు ఉండగా.. 2019-21 నాటికి ఏకంగా నాలుగు శాతం పెరిగారు. ఈ లెక్కన గడిచిన మూడేండ్లలో మాంసాహారుల సంఖ్య 5-8 శాతం మేర పెరిగి ఉంటుందనే అంచనాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా సగటున 77 శాతం మంది చికెన్, మటన్, ఫిష్, ఇతర మాంసాహారాలను తింటున్నారని లెక్క తేలింది. ఇక తెలుగు రాష్ట్రాల్లో ఈ సంఖ్య 96 శాతం మంది ఉండగా.. వారం నుంచి 15 రోజుల వ్యవధిలో ఒక్కసారైనా తునకలు ఇంట్లో ఉడికిస్తున్నారని తెలిసింది. పురుషులతో పోల్చితే మాంసం తినే మహిళల సంఖ్య గణనీయంగా తగ్గుతున్నది. వారానికి ఒకసారి కూడా తినని మహిళలు 39 శాతం మేర ఉన్నట్టు తేలింది. అదే పురుషుల్లోనైతే వారానికొసారైన తినేవారు 49 శాతం మంది ఉండగా, మెజార్టీగా సందర్భానుసారంగా ముక్కల భోజనం ఉండేలా చూసుకుంటున్నారు.

మటన్ కోసం ఘర్షణ

- పెండ్లి విందులో కొట్టుకున్న ఇరువర్గాలు

మెట్‌పల్లి రూరల్, మార్చి 20: వివాహ విందులో మటన్ అడిగినంత వేయలేదనే కారణంగా జరిగిన గొడవలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌లో చోటుచేసుకున్నది. మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి కథనం ప్రకారం.. మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌కు చెందిన అమ్మాయికి, వేములవాడకు చెందిన అబ్బాయికి బుధవారం ఆత్మకూర్‌లో వివాహం జరిగింది. ఈ వివాహ విందులో మటన్ సరిగ్గా వడ్డించలేదంటూ అబ్బాయి తరపు బంధువులు ఆరోపించారు. ఈ విషయమై అబ్బాయి, అమ్మాయి తరపు బంధువుల మధ్య ఏర్పడిన గొడవ పరస్పర దాడుల వరకు వెళ్లింది. ఈ దాడిలో ఇరు వర్గాలకు చెందిన పలువురు గాయపడ్డారు. ఇరు వర్గాల వారు పరస్పరం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసులు నమోదు చేశారు.

ఐటీ కారిడార్‌లోని కోకాపేటలో 63 అంతస్థులతో నిర్మించనున్న హైరైజ్ భవనం నమూనా.

కోకాపేటలో 63 అంతస్థుల ఆకాశహర్మ్యం

- నివాస క్యాటగిరీలో నిర్మాణానికి బిల్డర్ల సన్నాహాలు
- హైరైజ్ భవనాలకు కేరాఫ్ హైదరాబాద్

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 20 (నమస్తే తెలంగాణ): బహుళ అంతస్థుల భవన నిర్మాణాలతో ఆకాశమే హద్దుగా హైదరాబాద్ దూసుకుపోతున్నది తెలంగాణ ఏర్పడ్డాక అత్యాధునిక వసతులతో పెద్దఎత్తున హైరైజ్ భవనాలు అందుబాటులోకి వచ్చాయి. తాజాగా కోకాపేట కేంద్రంగా 63 అంతస్థుల మరో ఆకాశహర్మ్యాన్ని నిర్మించేందుకు బిల్డర్లు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీనికి సంబంధించి సన్నాహాలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నట్టు తెలిసింది. డిజైన్లు, స్థలం కోసం ఏర్పాట్లు చేసుకున్న తర్వాత ప్రభుత్వం నుంచి అనుమతుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నది. కాగా, ప్రస్తుతం పుప్పాల్‌గూడలో 59 అంతస్థులతో 'క్యాండూర్ స్కైలైన్' పేరుతో నిర్మాణం పనులు జరుగుతున్నాయి. అదేవిధంగా కోకాపేటలో 'సాస్‌క్రౌన్' పేరుతో 58 అంతస్థులతో భారీ భవన నిర్మాణం చివరదశలో ఉన్నది. దేశంలోని 7 ప్రధాన మెట్రో నగరాల్లో ఒకటైన హైదరాబాద్ వివిధ రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్నది. దేశ రాజధాని ఢిల్లీని వెనక్కి నెట్టి ఆర్థిక రాజధాని ముంబయి తర్వాత హైదరాబాద్‌లోనే అత్యంత ఎత్తయిన భవనాలు(హైరైజ్) ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ గతేడాదిలో ఒక ప్రకటనలో పేర్కొన్నది. హైరైజ్ భవనాల్లో ఆఫీసు కార్యకలాపాలే కాకుండా నివాసం ఉండేందుకు సైతం చాలా మంది ఆసక్తి చూపుతుండడంతో బిల్డర్లు సైతం అద్భుతమైన ఆర్కిటెక్చర్ డిజైన్లతో భవనాల నిర్మాణానికి ముందుకు వస్తున్నారు.

సీపీఐ నారాయణకు అస్వస్థత

- విరిగిన పక్కటెముక.. రెండు వారాల విశ్రాంతి

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ అస్వస్థతకు గురయ్యారు. ఈ నెల 16న కామారెడ్డిలో జరిగిన ఓ వివాహానికి హాజరైన సందర్భంలో వేదిక వద్ద జారిపడ్డారు. అయితే అప్పుడు ఆయన పట్టించుకోలేదు. అక్కడి నుంచి విశాఖపట్నం, చెన్నైలో జరిగిన పార్టీ సమావేశాల్లో కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంలో నారాయణకు పక్కటెముక వద్ద నొప్పి వచ్చింది. ఏఐజీ డాక్టర్లను సంప్రదించగా రిబ్ ఎముక విరిగినట్లు నిర్ధారించి, రెండు వారాల విశ్రాంతి తప్పనిసరి అని సూచించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన నివాసంలో నారాయణ విశ్రాంతి తీసుకుంటున్నారు. నారాయణ పరిస్థితిని తెలుసుకున్న పార్టీ నాయకులు ఆయనను పరామర్శిస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికల బరిలో సీపీఎం

- భువనగిరి అభ్యర్థిగా జహంగీర్ ఎంపిక

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాలకు ఒంటరిగానే బరిలోకి దిగాలని సీపీఎం నిర్ణయించింది. భువనగిరి పార్లమెంట్ స్థానానికి అభ్యర్థిని కూడా ప్రకటించింది. సీపీఎం భువనగిరి అభ్యర్థిగా జహంగీర్ పోటీ చేస్తారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్ వీరయ్య బుధవారం మీడియాకు వెల్లడించారు. మిగిలిన 16 స్థానాలకు తర్వాత త్వరలోనే అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని తెలిపారు.

హస్తం పార్టీతో సీపీఐ దోస్తీ

పార్లమెంట్ ఎన్నికలకు ఇప్పటికే షెడ్యూల్ విడుదల కాగా.. తొలి విడత ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ జారీ అయ్యింది. తెలంగాణలో 4వ విడతలో ఎన్నికలు జరగనుండగా.. అన్ని పార్టీలు గెలుపు వ్యూహాలు రచిస్తున్నాయి. ప్రధాన పార్టీలు ఇప్పటికే మెజార్టీ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించాయి. సీపీఐ అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరాగానే పార్లమెంట్ ఎన్నికల్లోనూ హస్తం పార్టీతో దోస్తీ కొనసాగించాలని భావిస్తుండగా.. సీపీఎం మాత్రం ఒంటరిగానే బరిలోకి దిగుతున్నది.

40 లక్షల విలువైన మద్యం లూటీ

- వైన్ షాపుల్లో ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నందుకు ఆగ్రహం
- నాలుగు వైన్ షాపులపై దాడి
- భద్రాద్రి జిల్లా టేకులపల్లిలో ఘటన

భద్రాద్రి జిల్లా టేకులపల్లిలోని వైన్స్ నుంచి మద్యం బాటిళ్లను తరలిస్తున్న గ్రామస్థులు

టేకులపల్లి, మార్చి 20: వైన్‌షాపుల యాజమాన్యాలు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు మద్యం విక్రయిస్తున్నారని ఆగ్రహించి గ్రామస్థులు మద్యం బాటిళ్లను లూటీ చేసిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలో జరిగింది. ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను తెలిపిన వివరాల ప్రకారం.. టేకులపల్లి మండల కేంద్రంలో మొత్తం నాలుగు వైన్ షాపులు ఉన్నాయి. బుధవారం ఉదయం 10 గంటల తర్వాత దుకాణాలు తెరుచుకున్నాయి. కొందరు గ్రామస్థులు వైన్స్‌కు వెళ్లారు. నాలుగు దుకాణాల్లో సిబ్బంది ఒక్కో క్వార్టర్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు అధికంగా వసూలు చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. యాజమాన్యాలు బ్రాండెడ్ మద్యాన్ని బెల్ట్ షాపులకు తరలిస్తున్నారని, దొరికే మద్యాన్నైనా ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని మండిపడ్డారు. దీంతో వైన్‌షాపుల వద్ద పరిస్థితి ఉద్రిక్తత ఏర్పడింది. ఆందోళనకారుల ఆగ్రహావేశాలతో సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. ఇదే అదునుగా భావించిన గ్రామస్థులు నాలుగు షాపుల్లో సుమారు రూ.40 లక్షల విలువైన మద్యం సీసాలను ఎత్తుకెళ్లారు. కొందరు ఒకటి రెండు సీసాలను తీసుకెళ్లగా మరికొందరు కాటన్ల కొద్దీ తమ ఇండ్లకు తరలించారు. సమాచారం అందుకున్న టేకులపల్లి సీఐ తాటిపాముల సురేశ్, ఇల్లెందు సీఐ కరుణాకర్ పోలీస్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వచ్చారు. వైన్ షాపుల యాజమాన్యాల ఫిర్యాదుల మేరకు విచారణ ప్రారంభించారు.

పశువులకు ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 20 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా, సలాల కొత్తపేట్, బాలాపూర్‌కు చెందిన సలామ్-బిన్-మహ్మద్ మిస్త్రీ మనుషులకు ఇచ్చే ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లను నిబంధనలకు విరుద్ధంగా పశువుల్లో పాల ఉత్పత్తిని పెంచేందుకు సరఫరా చేస్తున్నాడు. సమాచారం మేరకు డీసీఏ అధికారులు, పోలీసులు నిందితుడు మహమ్మద్ మిస్త్రీ ఇంటిపై దాడి చేసి, అక్రమంగా నిల్వ ఉన్న లేబుల్స్ లేని 50 ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లను సీజ్ చేశారు. కాగా, 'మెరోజ్‌ఫోర్డ్' 1గ్రాము అనే యాంటిబయోటిక్ ఇంజెక్షన్లను ఎంఆర్‌పీ (రూ.1067)కంటే అధిక ధర(రూ.3,390)లకు విక్రయిస్తున్న వరంగల్‌లోని ఒర్లిఫోర్డ్ హెల్త్‌కేర్ అనే ఔషధ విక్రయ కేంద్రంపై డీసీఏ అధికారులు దాడులు చేశారు. రూ.13,650 విలువైన ఔషధాలను సీజ్ చేశారు. అదేవిధంగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్, సుచిత్ర వద్ద ఉన్న మహానగర్ ఎస్టేట్‌కు చెందిన బొడసు రామానుజం ఇంటి నుంచి రూ.23.10 లక్షల విలువ చేసే ఔషధాలను సీజ్ చేశారు.

డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి రాజీనామా

పోచారం భాస్కర్‌రెడ్డి

ఖలీల్‌వాడి, మార్చి 20: నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (ఎన్‌డీసీసీబీ) చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి బుధవారం రాజీనామా చేశారు. పదవీకాలం మరో ఏడాది ఉండగానే ఆయన స్వచ్ఛందంగా తప్పుకొన్నారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను సహకార బ్యాంకు కమిషనర్‌కు అందజేశారు. పదవుల కోసం పార్టీలు మారుతున్న ప్రస్తుత తరుణంలో.. పార్టీ కోసం భాస్కర్‌రెడ్డి తన పదవిని వదులుకున్నారని బీఆర్‌ఎస్ నేతలు ప్రశంసిస్తున్నారు.

'ఎమ్మెల్యేతో చెక్కులు పంపిణీ చేయించొద్దు'

- మంత్రి పొన్నం ఫోన్‌కాల్ వాయిస్ రికార్డుగా వైరల్
- మండిపడ్డ రవాణా మంత్రి.. ఆర్డీవోపై సీఎస్‌కు ఫిర్యాదు

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ)/కమలాపూర్: మంత్రి పొన్నం ప్రభాకర్ తాజాగా మరో వివాదంలో ఇరుక్కున్నారు. రెండు నెలల క్రితం ఓ అధికారితో మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన ఫోన్ సంభాషణ వాయిస్ రికార్డు లీక్ కావడం కలకలం సృష్టించింది. మంత్రి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయినప్పటికీ, ఆ విషయాన్ని పక్కన పెట్టి తన మాటలను రికార్డు చేసి లీక్ చేసిన అప్పటి హనుమకొండ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని మంత్రి కోరడం చర్చనీయాంశంగా మారింది. ఐదు రోజులుగా ఇది సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై మంత్రి తీవ్రంగా స్పందించి సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి ఫిర్యాదు చేశారు. ఫోన్ సంభాషణ ఇలా.. 'గత ప్రభుత్వంలో హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్ ఉంటే అధికార పార్టీ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయించిండ్రు. ఇప్పుడు కౌశిక్‌రెడ్డి అధికార పార్టీ ఎమ్మెల్యే కాదు. మా కంటెస్ట్ అభ్యర్థి ప్రణవ్ చేతుల మీదుగా లేదా ప్రొటోకాల్ కాదంటే అధికారులే నేరుగా వెళ్లి లబ్ధిదారులకు చెక్కులు అందజేయాలి. ఒక్క చెక్కు ఎమ్మెల్యే చేతికి పోయినా బాగుండదు' అని మంత్రి పొన్నం అప్పటి హనుమకొండ ఆర్డీవో, కమలాపూర్ తహసీల్దార్ మాధవికి హుకుం జారీ చేసిన ఆడియో వైరల్ అయ్యింది. దీంతో తన ఫోన్ వాయిస్‌కాల్ రికార్డును లీక్ చేసిన హనుమకొండ ఆర్డీవో (ప్రస్తుతం బదిలీ అయ్యారు)పై చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు మంత్రి ఫిర్యాదు చేశారు. ఆర్డీవోపై ఫిర్యాదు విషయాన్ని మంత్రి పొన్నం బుధవారం గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ప్రస్తావించారు.

జీరో బిల్లు రానివారికి ప్రత్యేక కౌంటర్లు

- ఎంపీడీవో, మున్సిపల్, సర్కిల్ ఆఫీసుల్లో ఏర్పాటు
- పత్రాలతో సంప్రదిస్తే వెంటనే సవరణ: ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): అన్ని అర్హతలు ఉండీ గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లు రానివారికోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వం తెలిపింది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొని, పథకంలో లబ్ధి పొందేందుకు అర్హులైనా కూడా యూనిక్ సర్వీస్ (యూఎస్‌సీ) నెంబర్, ఆహారభద్రత వివరాలు తప్పుగా నమోదు వంటి కారణాల వల్ల అనేక మంది జీరో బిల్లుకు దూరమయ్యారు. ఇలాంటి వారు తమ వివరాలు సరి చేసుకునేందుకు మండల పరిషత్తు, మున్సిపల్, జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వం పేర్కొన్నది. ఇది ఒక నిరంతర ప్రక్రియ అని తెలిపింది.

బీసీలు లేకుండా సామాజిక న్యాయమా?

- పోరాటాలకు పనికొచ్చిన బడుగులు పదవులకు పనికిరారా?
- సీఎం రేవంత్, రాహుల్ గాంధీకి బీసీ మేధావుల సూటి ప్రశ్న

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలనలో బీసీల భాగస్వామ్యం లేకుండా సామాజికన్యాయం ఎలా సాధ్యమవుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని పలువురు బీసీ మేధావులు ప్రశ్నిస్తున్నారు. బాగ్‌లింగంపల్లిలోని బీసీ రాజ్యాధికార సమితి ప్రధాన కార్యాలయంలో బీసీ నాయకులు, ఉద్యమకారులు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, నిరుద్యోగులు బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పదవుల్లో బీసీలకు దక్కాల్సిన వాటాపై, ప్రస్తుతం దక్కిన వాటాపై సమీక్షించారు. ఈ సందర్భంగా బీసీ రాజ్యాధికార అధ్యక్షుడు సురేశ్, పలువురు బీసీ మేధావులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాలనలో తామూ భాగస్వాములమేనని ముక్తకంఠంతో నినదించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలకు ప్రభుత్వం 17 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూనే.. ప్రజాసంఘాల నాయకులకు పాలనలో అవకాశాలు కల్పించకపోవడాన్ని విమర్శించారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తుండగా తెలంగాణలో పదవులన్నీ రెడ్డి సామాజికవర్గానికే పరిమితమవుతున్నాయని, సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయాలను పరిగణలోకి తీసుకుని బీసీల ఎదుగుదలకు సహకరించాలని కోరారు. సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి గౌరవాధ్యక్షుడు ఆనందం, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కన్వీనర్ గుజ్జ కృష్ణ, మహిళా కన్వీనర్ ఊర్మిళ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వామి, నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు వెంకటేశ్, బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక సభ్యురాలు కృష్ణలత, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు పద్మావతి, ప్రధాన కార్యదర్శి స్వప్న, మీడియా సెక్రటరీ లక్ష్మణ్, పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్ తులసీ శ్రీమన్, బీసీ నాయకులు ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, మధుసూదన్, సుధాకర్, ఏపీ కన్వీనర్ కాలసముద్రం సుధాకర్, కొమురయ్య, రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం పాల్గొన్నారు.

రాష్ట్రంలో పడకేసిన పారిశ్రామికం

- నిలిచిపోయిన అనుమతులు, భూ కేటాయింపులు
- కొత్త పాలసీ వచ్చేవరకూ ఆగాలంటున్న అధికారులు

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పారిశ్రామిక రంగం గత ఐదు నెలల నుంచి పూర్తిగా పడకేసింది. అసెంబ్లీ ఎన్నికల కోడ్ మొదలైనప్పటి నుంచి కొత్త పరిశ్రమలకు అనుమతులు, భూముల కేటాయింపులు నిలిచిపోయాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్టు ప్రకటించడంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎదురుచూస్తున్నారు. తాజాగా, పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో నూతన పారిశ్రామిక విధానం మరో రెండు మూడు నెలల వరకు రాకపోవచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి.

రాష్ట్ర విభజనకు ముందు పెట్టుబడుల విషయంలో తీవ్ర వివక్షకు గురైన తెలంగాణ.. ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించాక అన్ని రంగాల్లో పరుగులు తీసింది. పారిశ్రామిక రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానానికి చేర్చాలన్న సంకల్పంతో గత కేసీఆర్ ప్రభుత్వం టీఎస్-ఐపాస్ పేరుతో నూతన చట్టాన్ని ప్రవేశపెట్టింది. దీంతో గత పదేండ్లలో రాష్ట్రానికి దాదాపు రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షలకుపైగా కొత్త ఉద్యోగ అవకాశాలు లభించాయి. అనంతరం సీఎం రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేసేందుకు నూతన విధానాన్ని ప్రవేశపెడతామని ప్రకటించింది. కానీ, ఇంతవరకు ఆ పాలసీని ప్రవేశపెట్టకపోగా, గతంలో యూనిట్లు ఏర్పాటు చేసుకున్నవారికి సైతం రాయితీలను విడుదల చేయడంలేదు. దీంతో దాదాపు రూ.3,500 కోట్ల మేరకు సబ్సిడీ బకాయిలు పేరుకుపోయాయి.

కేంద్ర పథకాలు సైతం అందని పరిస్థితి

కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేవారికి కేంద్ర ప్రభుత్వం సైతం వివిధ పథకాల కింద రాయితీలు అందిస్తున్నది. ఆహారశుద్ధి, ఔషధాలు, వస్త్రాలు, లెదర్, ఎలక్ట్రానిక్స్, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు విరివిగా ప్రోత్సాహకాలను అందజేయడంతోపాటు క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద నూతన పారిశ్రామికవాడల ఏర్పాటునకు చేయూతనిస్తున్నది. అయితే, కేంద్రం అమలుచేసే పథకాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వమే నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్నది. పరిశ్రమలకు కేంద్రం అందించే రాయితీలను రాష్ట్ర ప్రభుత్వమే బ్యాంకుల ద్వారా పంపిణీ చేయాల్సి ఉన్నది. కానీ, గత కొన్ని నెలల నుంచి రాష్ట్రంలో కొత్త పరిశ్రమలకు అనుమతులు నిలిచిపోవడంతో కేంద్ర పథకాలు సైతం అందడం లేదు. దీంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

అనుమతులు లేక.. రుణాలు రాక

సాధారణంగా ప్రభుత్వ ప్రోత్సాహకాలు, బ్యాంకు రుణాలు లేకుండా పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఎవరూ ముందుకు రారు. పరిశ్రమల శాఖ అనుమతులు ఉన్న యూనిట్లకే బ్యాంకు రుణాలు మంజూరవుతాయి. టీఎస్-ఐపాస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న పారిశ్రామికవేత్తలకు అర్హతలను బట్టి రాయితీ ధరతో భూములను కేటాయిస్తారు. ఇలా భూములు పొందినవారికే సులభంగా రుణాలు ఇస్తారు. ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలను పొందేందుకు కూడా అనుమతులు తప్పనిసరి. కానీ, రాష్ట్రంలో గత ఐదు నెలల నుంచి కొత్త పరిశ్రమలకు అనుమతులు ఇవ్వకపోవడం, భూకేటాయింపులను నిలిపివేయడంతో దరఖాస్తుదారులకు ఎదురుచూపులు తప్పడంలేదు.

నూతన పాలసీ వచ్చేవరకూ ఆగాల్సిందే

రాష్ట్రంలో కొత్త పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలనుకునేవారు నూతన పారిశ్రామిక విధానం వచ్చేవరకు వేచిచూడక తప్పని పరిస్థితి నెలకొన్నది. రాయితీలపై ప్రభుత్వం కొత్త పాలసీని తీసురావాలన్న యోచనలో ఉన్నదని, ఎంపీ ఎన్నికలు పూర్తయ్యాక ఈ విధానాన్ని ప్రకటించే అవకాశమున్నదని అధికారులు చెప్తున్నారు. నూతన పారిశ్రామిక విధానానికి సంబంధించిన ముసాయిదా ఇప్పటికే సిద్ధమైందని, దీన్ని ప్రభుత్వం ఆమోదించాల్సి ఉన్నదని చెబుతున్నారు.

ఇరిగేషన్ అధికారులతో ఎన్‌డీఎస్‌ఏ కమిటీ మరోసారి భేటీ

- మూడు బరాజ్‌ల అధికారుల నుంచి వివరాల సేకరణ
- పూర్వ ఈఎన్సీలు మురళీధర్, వెంకటేశ్వర్లు సైతం హాజరు

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలోని సమస్యలను గుర్తించి, పునరుద్ధరణ చర్యలను సిఫారసులు చేసేందుకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన నిపుణుల కమిటీ మరోసారి రాష్ట్రానికి వచ్చింది. చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో 6 సభ్యులతో కూడిన ఈ కమిటీ బుధవారం రాష్ట్ర ఇరిగేషన్ అధికారులతో మరోసారి సమావేశమైంది. మధ్యాహ్నం 3 గంటలకు జలసౌధకు చేరుకుని, ఇరిగేషన్ ఈఎన్సీ, ప్రాజెక్టు ప్లానింగ్, హైడ్రాలజీ, ఇన్వెస్టిగేషన్ అధికారులతోపాటు, 3 బరాజ్‌లకు సంబంధించిన అధికారులు, డీపీఆర్‌లు తయారు చేసిన అధికారులు, సీడీవో అధికారులతో సాయంత్రం 7.30 గంటల వరకు సమావేశమైంది. ఈ భేటీలో వారి నుంచి పలు వివరాలను సేకరించడంతోపాటు పూర్వ ఈఎన్సీలు మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లను కూడా విచారించింది.

గురుకులాల్లో విద్యార్థుల ఘర్షణ

- ఎనిమిదో తరగతి విద్యార్థిపై తోటి విద్యార్థుల దాడి
- కొత్తకోటలో మాట వినడం లేదని విద్యార్థుల గొడవ
- ఆర్సీవో విచారణ.. పది రోజుల పాటు నలుగురి సస్పెండ్

చేతికి గాయమైన దృశ్యం

విచారణ చేపడుతున్న ఆర్సీవో విద్యులత

వెల్గటూర్/కొత్తకోట, మార్చి 20: గురుకుల పాఠశాలల్లో కలిసిమెలిసి ఉండాల్సిన విద్యార్థులు తరచూ ఘర్షణలకు దిగుతున్నారు. జూనియర్లు, సీనియర్లు అనే భావన తీసుకొచ్చి దాడులకు దిగుతున్నారు. మాట వినడం లేదన్న కోపంతో మితిమీరి ప్రవర్తిస్తున్నారు. అందుకు.. జగిత్యాల, వనపర్తి జిల్లాల్లోని గురుకుల పాఠశాలల్లో వారం రోజుల కిందట జరిగిన గొడవలే నిదర్శనం. తల్లిదండ్రుల చొరవతో ఈ రెండు చోట్ల జరిగిన ఘటనలు ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చాయి. జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం గుంజపడుగుకు చెందిన పస్తం లత-కనకయ్య కొడుకు రిషి (13) వెల్గటూర్ మండలం స్తంభంపల్లి బీసీ గురుకులంలో 8వ తరగతి చదువుతున్నాడు. తన పుట్టినరోజున రిషి డ్రెస్ దొంగిలించాడని తోటి విద్యార్థి రాము జనవరి 9న 9, 10వ తరగతి చదువుతున్న అభినయ్, శ్రీహర్ష, శ్రీకాంత్‌కు చెప్పాడు. అదే రోజు రాత్రి ఆ ముగ్గురు డ్రెస్ గురించి రిషిని అడిగారు. తనకేం తెలియదని చెప్పినా వినకుండా పరీక్ష ప్యాడ్‌లతో తలపై గట్టిగా కొట్టగా తలకు తీవ్రగాయమైంది. ఈ విషయాన్ని ఎవరికైనా చెప్తే.. బిల్డింగ్‌పై నుంచి తోసేస్తామని బెదిరించడంతో రిషి ఎవరికీ చెప్పలేదు. కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురవుతుండటంతో తల్లిదండ్రులు హాస్టల్ నుంచి ఇంటికి తీసుకెళ్లి తరచూ దవాఖానల్లో చూపించారు. అయినా తగ్గకపోవడంతో మూడు రోజుల క్రితం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ వైద్యుడికి చూపించగా, వైద్యుడి సలహా మేరకు ఎంఆర్‌ఐ తీయించారు. తలకు బలమైన గాయం కావడంతో మెదడులో రక్తం గడ్డ కట్టినట్టు వైద్యులు గుర్తించారు. దీంతో తల్లిదండ్రులు రిషిని నిలదీయగా.. అసలు విషయం చెప్పాడు. ఆగ్రహించిన తల్లిదండ్రులు, బంధువులు బుధవారం గురుకులానికి చేరుకొని ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని తల్లిదండ్రులను సముదాయించారు.

వనపర్తి జిల్లాలో..

కొత్తకోట పట్టణ సమీపంలోని సాంఘిక సంక్షేమ (వీపనగండ్ల) గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులపై 9వ తరగతి స్టూడెంట్స్ కొన్ని రోజులుగా దాడికి పాల్పడుతున్నారు. జూనియర్స్ చెప్పిన మాట వినడం లేదని తరచూ కర్రలతో దాడి చేస్తున్నా.. బాధిత విద్యార్థులు ఎవరికీ చెప్పలేదు. రెండు రోజుల క్రితం 9వ తరగతి చదువుతున్న హర్ష, శివాజీ, కేతన్, ప్రసాద్ 8వ తరగతి విద్యార్థుల వీపులపై కర్రలతో దాడి చేయగా వాతలు పడ్డాయి. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు బుధవారం పాఠశాలకు చేరుకొని ప్రిన్సిపాల్ దయాకర్‌ను నిలదీశారు. ఆర్సీవో విద్యులతకు సమాచారం అందించగా.. పాఠశాలకు చేరుకొని విద్యార్థులను విచారించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దాడి చేసిన నలుగురు విద్యార్థులను పది రోజులపాటు సస్పెండ్ చేశారు.

ఉపాధి కూలీలకు రూ.200 కోట్ల బకాయిలు

- నెల రోజులుగా చెల్లించని కూలీ
- ఎట్టకేలకు ఉద్యోగులకు మూడు నెలల వేతనాలు
- వేతనాలపై ఫలించిన బీఆర్‌ఎస్ పార్టీ ఒత్తిడి

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం నెల రోజులుగా కూలి డబ్బులు అందడం లేదు. ఫలితంగా రూ.200 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. పూట గడవడానికి కూలి పనిచేసుకొనే కార్మికులు సకాలంలో డబ్బులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో 53 లక్షల జాబ్ కార్డులు జారీ కాగా, ఇందులో 1.11 కోట్ల మంది సభ్యులు ఉన్నారు. వీరు గత నెల రోజుల్లో దాదాపు రూ.200 కోట్ల విలువైన పనులు చేశారు. కూలీలకు చెల్లించే కొద్దిపాటి మొత్తం కూడా కేంద్రం సకాలంలో చెల్లించడంలేదు. కూలీలు చేసే పనులు వందశాతం నిధులను కేంద్ర ప్రభుత్వమే సమకూర్చాల్సి ఉంటుంది. ఉపాధి కూలీల కూలిని నేరుగా కేంద్ర ప్రభుత్వమే వారి అకౌంట్లలో జమ చేయాలి. కానీ, బీజేపీ ప్రభుత్వం మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. వేసవిలో ఎండలో కూలీలు పనిచేసినా సకాలంలో డబ్బులు చెల్లించడానికి కేంద్ర ప్రభుత్వానికి చేతులు రావడం లేదు. వెంటనే డబ్బులు రావని, కూలీలు ఇతర పనులకు వెళ్లడం, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ ఒత్తిడితో విడుదలైన ఉద్యోగుల వేతనాలు

ఉపాధి హామీ ఉద్యోగులకు డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలలకు వేతనాలను కూడా కేంద్రం చెల్లించలేదు. ఉద్యోగుల వేతనాలను సకాలంలో చెల్లించాలని బీఆర్‌ఎస్ నేతలు కేంద్రానికి విజ్ఞప్తులు చేస్తూ వస్తున్నారు. ఉద్యోగులకిచ్చే కొద్దిపాటి వేతనాలను కూడా నెలల తరబడి చెల్లించకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని నిలదీస్తూ వస్తున్నారు. బీఆర్‌ఎస్ నేతల ఒత్తిడికి దిగివచ్చిన కేంద్ర సర్కారు ఎట్టకేలకు రాష్ట్రంలోని 12,600 ఉద్యోగుల మూడు నెలల వేతనాల కోసం రూ.73 కోట్లను బుధవారం విడుదల చేసింది.